క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన కార్యవర్గం



వినుకొండ(నూజెండ్ల): విశ్వబ్రాహ్మణ సంఘీయులందరూ ఐకమత్యంతో అన్నదాన సత్రం అభ్యున్నతికి సహకరించాలని అద్దంకి సుధాకర్ అన్నారు. నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి సన్నిధిలో అన్నదాన సత్రం నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడు అద్దంకి సుధాకర్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అన్నదాన సత్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నల్లగట్ల ఈశ్వరచారి అధ్యక్షతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికల అనంతరం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. నూతన ఉపాధ్యక్షులుగా కుందుర్తి సీతారామాంజినేయులు, చందలూరి శివనాగేశ్వరరావు, సెక్రటరీ జుజ్జురి వాసవాచారిలను, పాత కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. స్థలదాత లక్కిరెడ్డి సంజీవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు వావిచర్ల వెంకటేశ్వర్లు నూజెండ్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మోతడక వీరాచారిలను ఘనంగా సత్కరించారు.

పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం




వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్‌గా ప్రముఖ చిత్రకారుడు బొద్దుచర్ల ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం.మూర్తి, ఆర్.శంకర్, సెక్రటరీగా కె.వందనంబాబు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ బాజీ, బీరం శ్రీను, ట్రెజరర్ ఎస్.కె.సైదాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని, అలాగే పెయింటర్స్, ఆర్టిస్టులకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులు కొరకు కృషి చేస్తామని, వారికి అండగా పనిచేస్తామని తెలిపారు. ఎం.పౌలు రాజు, ఎస్.రాజు కుమార్ సింగ్, జి.చంద్రం, కె.నాగరాజు, పి.రామకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై ఎమ్మెల్యే వర్గీయుల దాడి!



చిలకలూరిపేట: దివ్యాంగుడైన ఓ పత్రికా విలేకరిపై టీడీపీ వర్గీయులుగా భావిస్తున్న వారు దాడికి పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు గూడూరు సుబ్బు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న ఓ బార్అండ్ రెస్టారెంట్ వద్ద సుబ్బుకు మిత్రుడైన సుధీర్‌పై మిట్టపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్బు ఎందుకు అతనిని కొడుతున్నారని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన వారు మేం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బంధువులం, ఎవరినైనా కొడతాం అంటూ సుబ్బుపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. దీంతో గాయాల పాలైన సుబ్బు ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై అర్బన్ సీఐ పి.రమేష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



మృతుడు అజయ్ (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల):నియోజకవర్గంలోని ఈపూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లవరపు అజయ్(42)కు గుండెపోటు రావటంతో గుంటూరు లలిత హాస్పిటల్‌కు నాలుగు రోజులు క్రితం తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని అతని స్వగ్రామం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామానికి తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో అజయ్ నియోజకవర్గంలోని పలుస్టేషన్‌ల్లో హోంగార్డుగా విధులు నిర్వహించాడు.

కావలి పోలీసుల అదుపులో చిలకలూరిపేట వ్యక్తులు !

నరసరావుపేట: గోవా అక్రమ మద్యం కేసులో ఇద్దరిని నెల్లూరు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని పురుషోత్తమపట్నంకు చెందిన ఇద్దరు వ్యక్తుల్ని ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. వీరిని అక్రమ మద్యం కేసు విచారణ నిమిత్తం నెల్లూరు జిల్లా కావలి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మంచుకొచ్చే ముప్పు!

- రాత్రిళ్లు, తెల్లవారుజామున దట్టంగా కురుస్తున్న పొగమంచు
- అప్రమత్తంగా లేకుంటే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం
- సురక్షిత ప్రయాణానికి జాగ్రత్తలు అవసరం



చిలకలూరిపేటలో జాతీయ రహదారిని కమ్మేసిన పొగ మంచు



రాష్ట్ర రహదారిపై మంచులో ప్రయాణిస్తున్న వాహనాలు

యడ్లపాడు: జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. అదే సమయంలో మంచు కూడా దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటల వరకు పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. దీంతో దగ్గరికి వచ్చినంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జనవరి నెలాఖరు వరకు దట్టమైన పొగమంచు కురుస్తుంటుంది. వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. రహదారి ప్రమాదాలకు గురికాక తప్పదు. జిల్లాలో రెండు, నాలుగు, ఆరు వరుసల రహదారులు విస్తరించాయి. ఎత్తుపల్లాలు, మలుపులు ఉండటంతో ఆయా ప్రదేశాల్లో మరింత జాగ్రత్తగా వాహనాలు నడపడం అవసరం. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో ఏటా జరిగే రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందేవారు, క్షతగాత్రులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. మంచు కురుస్తున్న కారణంగా వాహనాలను నెమ్మదిగా నడపాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మంచు తీవ్రత ఎక్కువగా ఉంటే మంచు తగ్గేవరకు వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో పెట్టుకుంటే మంచిదని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాలకు కారణం..

- దట్టంగా అలుముకున్న మంచుతో మార్గం కానరాదు
- దారి కనిపించకున్నా వాహనాన్ని వేగంగా నడపడం..
- డ్రైవర్‌కు సరైన నిద్ర లేకపోవడం, మంచు మరో కారణం
- రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయడం.

ముందస్తు జాగ్రత్తలు ..

- అర్ధరాత్రి దాటిన తర్వాత, ఉదయం ఆరులోపు దూరప్రయాణాలు చేయకపోవడం ఉత్తమం.
- పొగమంచు అధికంగా ఉంటే వాహనాలు నడపడం సురక్షితం కాదు.
- ఆ సమయంలో వీలైనంత వరకు వాహనాలను నడపకుండా ఉంటే మంచిది.
- పొగమంచులో డ్రైవింగ్ చేసే సమయంలో వాహన వేగం తగ్గించాలి.
- చోదకులు సేఫ్ డిస్టెన్స్ పాటించాలి
- రోడ్డు కనపడే దూరాన్ని బట్టి వేగాన్ని అంచనా వేసుకోవాలి
- మంచువేళ ఎట్టి పరిస్థితుల్లో ఎదురుగా వెళ్లే వాహనాన్ని అధిగమించే ప్రయత్నం చేయకూడదు.
- రోడ్డు కనిపించే దూరం 10–15 మీటర్ల మధ్య ఉంటే 35 కిమీ వేగంలోపు నడపాలి.
- మంచు తీవ్రంగా ఉంటే సురక్షితమైన ప్రాంతంలో వాహనాన్ని పార్కింగ్ చేయడమే మంచిది.
- రహదారి సూచికలు, వైట్‌లైన్లను అనుసరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చు.
- వాహనానికి అమర్చే రెడ్ సిగ్నల్స్, బ్రేక్ సిగ్నల్స్ సరిగా పనిచేస్తున్నాయా లేదో సరిచూసుకోవాలి.
- హైబీమ్ లైట్స్ ఉపయోగించరాదు. వాటివల్ల స్పష్టంగా కనిపించదు.
- వాహనం నడిపేటప్పుడు విండ్‌షీల్డ్ వైపర్‌లు, డిఫ్రాస్టర్లు ఉపయోగించాలి
- ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించేలా హెడ్ లైట్స్ ఆన్, ఆఫ్ చేస్తూ ఉండాలి
- వ్యవసాయ కూలీలను తరలించే ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్, బస్సులకు విధిగా వెనుక, ముందు రేడియం స్టిక్కర్లు అతికించాలి
- మంచు కురిసే సమయంలో రోడ్లు తడిగా ఉంటాయి. వాటిపై బైక్‌పై బ్రేక్ వేస్తే స్కిడ్ అయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి..



అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం. వాహనం ఏదైనా.. నడిపే చోదకుడు అప్రమత్తంగా ఉండాలి. వాహనాలతో రోడ్డు ఎక్కే ప్రతిఒక్కరూ భద్రత నిబంధనలు పాటించాలి. పొగమంచు ప్రభావంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించవు. ఆ సమయాల్లో ప్రయాణం సరి కాదు. రాత్రిళ్లు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపరాదు.

–బి.సుబ్బానాయుడు, రూరల్ సీఐ చిలకలూరిపేట

ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రారంభించాలి

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రభుత్వం ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రైతుసంఘం నాయకుడు కనగాల వెంకట రామ మోహన్‌చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో నిలుపుదల చేయటంతో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం సత్వరమే కొనుగోలు ప్రారంభించాలన్నారు. రైతుల ముసుగులో దళారులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మటం హేయమైన చర్య అన్నారు. కొనుగోలు కేంద్రాలు నిలుపుదల చేయటం వల్ల దళారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి రైతులను దోచుకోవటంతో పాటు కాటాల్లో కూడా మోసం జరుగుతుందన్నారు. తూనికల కొలతలు శాఖ అధికారులు నిద్రమత్తు విడి తక్షణమే కాటాలపై నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించాలన్నారు. రైతుకు సంబంధించి రవాణా ఖర్చు విషయంలో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం రవాణా చార్జీలపై సడలింపు చేయాలన్నారు. పంట దిగుబడులు అనుగుణంగా కొనుగోలు చేయాలి. చివరిగింజ వరకు కొనుగోలు రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఆలసత్వం వలన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చిన కొనుగోలు నిలుపుదల చేయటం వలన రైతులు బహిరంగ మార్కెటులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయనతో పాటు రైతుసంఘం నాయకులు భువనగిరి వెంకటేశ్వర్లు, గణపర్తి వెంకటేశ్వర్లు, బోయపాటి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై 6ఏ కేసు నమోదు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో చౌకధరల దుకాణాలపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన 10,11,38 నెంబరు షాపుల్లో సరుకుల వ్యత్యాసం ఉండటంతో తనిఖీ చేయగా వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. ఆయా రేషన్‌షాపుల్లో 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఈ మేరకు తెలిపారు.

నేటి నుంచి పశు వైద్య ఆరోగ్య శిబిరాలు



పశువుకు పరీక్షలు చేస్తున్న దృశ్యం(ఫైల్)

యడ్లపాడు: నియోజకవర్గంలో పశువైద్య ఆరోగ్యశిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చిలకలూరిపేట, యడ్లపాడు ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో మొత్తం 59 గ్రామాల పరిధిలో సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు ఈ వైద్య శిబిరాలు ప్రతిరోజు రెండు, మూడు గ్రామాల చొప్పున అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు చిలకలూరిపేట, యడ్లపాడు ఏడీలు టి.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ తెలిపారు. ఈ శిబిరాల్లో రెండు వైద్యబృందాలు పాల్గొంటారు. ఒక్కో వైద్య శిబిరంలో పశు వైద్యాధికారితో పాటు పశువైద్య సేవా సహాయకుడు, రైతు సేవాకేంద్రం సహాయకులు, వైద్య బృందంతో కలిసి సేవలు అందిస్తారు. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల వారీగా నిర్వహించే వైద్యశిబిరాల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

షెడ్యూల్ ఇలా...

యడ్లపాడు మండలం: 20వ తేదీన కొత్తపాలెం, 21న కొండవీడు, వంకాయలపాడు, ఉప్పరపాలెం, 22న కోట, సంతపేట, తుర్లపాడు, జాలాది, 23న చెంఘీజ్‌ఖాన్‌పేట, తిమ్మాపురం, సందెపూడి, 24సంగం గోపాలపురం, 25న ఉన్నవ, కారుచోల, 27నలింగారావుపాలెం, 28న మైదవోలు, దింతెనపాడు, 29న సొలస, 30న బోయపాలెం, 31న జగ్గాపురం నాదెండ్ల మండలం..20వ తేదీన అమీన్‌సాహెబ్‌పాలెం, సాతులూరు, 21న ఇర్లపాడు, 22న నాదెండ్ల, గణపవరం, చందవరం, 23న అప్పాపురం, బుక్కాపురం, 24న తూబాడు, గొరిజవోలు, 27న చిరుమామిళ్ల, సంక్రాంతిపాడు, 28న ఎండుగుంపాలెం, 29న జంగాలపల్లి, 30న కనపర్రు చిలకలూరిపేట మండలం..20వ తేదీన గంగన్నపాలెం, వేలూరు, 21న పసుమర్రు, కమ్మవారిపాలెం, 22న కోమటినేనివారిపాలెం, మానుకొండవారిపాలెం, 23న గోవిందపురం, గొట్టిపాడు, ఈవూరివారిపాలెం, గోరంట్లవారిపాలెం, 24న బొప్పూడి, నాగభైరవవారిపాలెం, దండమూడి, 25న యడవల్లి, 27న మురికిపూడి, తాతపూడి, రామచంద్రాపురం, మద్దిరాల, 28న కట్టుబడివారిపాలెం, 29న రాజాపేట, 30న కావూరు, గోపాళంవారిపాలెం, 31వ తేదీ లింగంగుంట్ల, పోతవరం గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయి.

శావల్యాపురం: నేటి నుంచి ఈనెల 28వరకు మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించుతున్నట్లు పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలు ఏర్పాటు చేయటం వలన పశువులకు సంబంధించి ఎద్దైనా సమస్యలు ఉంటే వాటిని పరీక్షించి తగిన చికిత్స అందించటం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న దూడలకు జీవాలకు నట్టల నివారణ మందు బొబ్బ టీకాలు చేయటం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని పశుపోషకులు జీవాలు పెంపకదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శిబిరాల్లో అందించే సేవలు

- ముందుగా పశుపోషకులకు అవగాహన కల్పిస్తారు
- లేగదూడలకు నట్టల నివారణ మందులు అందిస్తారు
- గొర్రెలు, మేకలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు
- పశువులు అనారోగ్యంతో ఉండి ఎదకు రాకున్నా వాటికి పరీక్షలు చేస్తారు
- గర్భకోశ వ్యాధులు ఉన్నా చికిత్సలు నిర్వహిస్తారు
- అవి ఎదకు వచ్చేలా వైద్య సలహాలు, చికిత్సలు చేస్తారు

అ‘పూర్వ’ సమ్మేళనం

- ఐదు దశాబ్దాల అనంతరం కలుసుకున్న మిత్రులు
- యడ్లపాడు లూథరన్ హైస్కూల్‌లో 1977–78 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువుల్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

యడ్లపాడు: వారంతా ఆ పాఠశాలలో పదో తరగతి వరకు అభ్యసించినవారే. సుమారు ఐదు దశాబ్దాల తర్వాత తిరిగి అక్కడే కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. తమ పిల్లలకు తాము చదువుకున్న తరగతి గదుల్ని చూపించి, నాటి మధుర స్మృతుల్ని నెమరు వేసుకున్నారు. తమ స్నేహితుల్ని కుటుంబ సభ్యులకు పరిచయం చేస్తూ.. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. మండలకేంద్రమైన యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో 1977లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు జోసేఫ్, వినతి, రాజారావు మాస్టారులకు ఘనంగా సన్మానం చేశారు. నాగండ్ల శేషగిరిరావు అధ్యక్షత వహించగా, చాగంటి శివకోటిరెడ్డి, వైబీవీ శ్రీనివాసరావు, పి.బెంజిమన్, ఉన్నవ సాంబయ్య, ఉప్పలపాటి రాజ్యలక్ష్మిలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సాల్మన్‌రాజు(విశాఖపట్నం), రాజేశ్వరి(బెంగళూరు), సుకన్య(హైదరాబాద్), ముత్తవరపు ఆంజనేయులు తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు
- వరవకట్టలో కార్డెన్‌సెర్చ్



వరవకట్టలో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ విజయచరణ్, సిబ్బంది

నరసరావుపేట: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, అల్లర్లు సృష్టిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పర్యవేక్షణలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరవకట్టలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేసి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆ సమయంలో వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు తెలుపకపోతే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలను ఉక్కుపాదంతో అణిచివేస్తామని సీఐ విజయ్‌చరణ్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజా స్వేచ్ఛ జీవనానికి ప్రజలు సహకరించాలని కోరారు. రూరల్ ఎస్ఐ కిషోర్, వన్‌టౌన్ పట్టణ ఎస్ఐ అరుణరెడ్డి, టూటౌన్ ఎస్ఐ అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని విల్లుకు పూజలు

దాచేపల్లి : అయోధ్యరాముని కోదండ విల్లు ఆదివారం దాచేపల్లికి చేరుకుంది. హైదరాబాద్ నుంచి నగర పంచాయతీ పరిధిలోకి ప్రవేశించిన విల్లుకి భక్తులు స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు కేజీ బంగారం, 13 కేజీల వెండితో విల్లు, బాణం తయారు చేయించి అయోధ్యకు పంపిస్తున్నాడు. ఈ క్రమంలో దాచేపల్లిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో విల్లు, బాణంకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులు విల్లు, బాణం దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దాచేపల్లి నుంచి గురజాలకు విల్లు, బాణాన్ని సాగనంపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మాశెట్టి బుజ్జి, నాశం శ్రీనివాసరావు, గరిణే పుల్లారావు, మండ్లేం రామారావు, బత్తుల వెంకయ్య, నాగేశ్వరరావు, దేవరశెట్టి రమేష్, బత్తుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టు

పిడుగురాళ్ల : స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో 71వ అంతర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి డి.నల్లిరెడ్డి, ఉపాధ్యక్షుడు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎం.నాగేంద్రబాబు, నల్లపాటి ధనుంజేయులు, ఆవుల జనార్ధన్, మదినా మస్తాన్‌వలి, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

హిందీ పండిట్‌కు పూలే అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న రంగా జ్యోతిలక్ష్మి సావిత్రీబాయి పూలే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యింది. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం పీవీ ఇన్నారెడ్డి, ఫాదర్స్ విజయ్ పీటర్, కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాహు-కేతు పూజలు

నకరికల్లు:మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాహుకేతు పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మవరకు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే పూజాధికాల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశేష అలంకరణలో ఉన్న రాహుకేతువులను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

అమిత్‌షా పర్యటన నిరసిస్తూ సీపీఐ ప్రదర్శన



నరసరావుపేట ఈస్ట్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినదించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్రంలోనూ, రాష్ట్రాల రాజకీయాలలోనూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తూన్నారని విమర్శించారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని మోదీ ఇంతవరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, షేక్ చిన జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి..

నరసరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడ వచ్చిన అమిత్‌షాకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల మార్కెట్ యార్డు ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.గోపాలరావు, షేక్ సిలార్ మసూద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయరాజు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకుడు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.